

డెంగీ, మెదడువాపుతో బాలుడు మృతి

జీలుగుమిల్లి: డెంగీ జ్వరం, మెదడువాపుతో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని టి.గంగన్నగూడెం పంచాయితీలోని దిబ్బగూడెంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన డి.సుహాస్‌చంద్(12) శ్రీచైతన్య స్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. అయితే వారంరోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో జంగారెడ్డిగూడెంలోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయినా తగ్గకపోవడంతో పరీక్షలు చేయించగా డెంగీగా నిర్ధారణ అయింది. దీంతోపాటు మెదడువాపు కూడా తోడవడంతో మెరుగైన వైద్యం కోసం రాజమండ్రిలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.అక్కడ కూడా తగ్గకపోవడంతో విజయవాడలోని రెయిన్ బో ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. బాలుడి తండ్రి టి.నరసాపురం మండలంలో వ్యవసాయాధికారిగా పనిచేస్తున్నారు. అయితే వృత్తిరీత్యా కొన్నేళ్లుగా దిబ్బగూడెంలో నివాసం ఉంటున్నారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

అడుగంటుతున్న చెరువులు.. ఎండుతున్న పంటలు..!

వర్షాభావంతో ఎండుతున్న వరి పంట
గుడిపాడు రావికుంట చెరువు ఆయకట్టు
రైతుల పరిస్థితి అగమ్యగోచరం
వ్యవసాయ విద్యుత్ కోతలతో బోర్ల కింద
రైతులదీ అదే పరిస్థితి

అడుగంటిన గుడిపాడు రావికుంట చెరువు

ప్రజాశక్తి - ముసునూరు

చినుకు జాడ లేదు.. చెరువులు అడుగంటాయి.. ఇప్పటి వరకూ వర్షం కోసం ఆశగా ఎదురు చూసిన రైతులకు చివరకు నిరాశే మిగిలింది. వర్షాలు పడే పరిస్థితి కూడా కనిపించడం లేదు. వానాకాలం మూడు నెలలు ముగిసిపోయాయి. దీంతో వర్షాల మీద ఆధారపడి సాగుచేసిన పంటలు ప్రస్తుతం ఎండిపోతున్నాయి. చెరువులు, బోర్ల కింద పంటలు సైతం ఎండిపోతున్నాయి. చెరువు నీటితో కొంతవరకు పంటను కాపాడుకుంటూ వచ్చిన రైతులు అవికాస్తా అడుగంటడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు ఏడాదికి ఒకసారి పండించే వరి పంట కూడా పండకపోతే ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కష్టపడి చి'వరి' దశకు తీసుకొచ్చిన పంట నీరు లేక ఎండిపోతుంటే ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, తమను ఆదుకోవాలంటూ మండలంలోని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ముఖ్యంగా మండలంలోని గుళ్లపూడి రెవెన్యూ గ్రామ పరిధిలోని గుడిపాడు రావికుంట చెరువు కింద 279 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. ప్రస్తుతం ఈ చెరువు అడుగంటింది. దీంతో చెరువు ఆయకట్టులోని పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పంటను ఎలా కాపాడుకోవాలో అర్థంకా మదనపడుతున్నారు. వర్షం కురిస్తే తప్ప చెరువులోకి నీరు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతునాన్నరు.

ఎండిన వరిపైరును చూపుతున్న గుడిపాడు రైతులు

బోర్లకిందా అదే పరిస్థితి

బోర్లమీద ఆధారపడి సాగుచేసిన రైతుల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారింది. మాండలంలో సుమారు 5600 ఎకరాల్లో వరిపంటను సాగుచేశారు. పంట చివరి దశకు చేరుకుంటోంది. అయితే వ్యవసాయానికి ఇస్తున్న తొమ్మిది గంటల విద్యుత్ సక్రమంగా ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తరచూ విద్యుత్ కోతలతో వరిచేలకు నీరు చాలక ఎండిపోతున్నాయి. దీనికితోడు ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో నీరుపెట్టినప్పటికీ ఎక్కువ సమయం ఉండటం లేదని, తరచూ నీరు పెట్టాల్సి వస్తోందని, కరెంట్ లేక పంటలు ఎండిపోతున్నాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు పంట చివరి దశలో పుష్కలంగా నీరు ఉండాలని, లేకుంటే దిగుబడి పడిపోతుందని రైతులు వాపోతున్నారు. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌలురైతుల పరిస్థితి దారుణం

మండలంలోని కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వర్షాభావంతో సాగునీరు లేక కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేని వాపోతున్నారు. ఈసారి లాభాల సంగతి ఎలా ఉన్నా కౌలు ఖర్చులు కూడా వచ్చేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు కౌలు ఖర్చులు కలుపుకుని సుమారు రూ.40 వేల వరకూ ఖర్చు చేశామని, ప్రస్తుతం తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీరులేక పంట పూర్తిగా ఎండిపోయింది

బి.జయమ్మ, రైతు, గుళ్లపూడి

నా భర్త చనిపోయినప్పటినుండి నా పిల్లలతో కలిసి 2.70 ఎకరాల్లో వరి పంట సాగుచేస్తున్నాను. ఈ పంటే నాకు ఆధారం. కానీ ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో పంట చేతికొచ్చే సమయంలో చెరువులో నీళ్ల లేక వరి పంట పూర్తిగా ఎండిపోయింది. మాది ఉమ్మడి కుటంబం. కుటుంబ పోషణ కష్టంగా మారింది.

ప్రభుత్వమే ఆదుకోవాలి

పంతగాని తిరుపతి స్వామి, రైతు, గుళ్లపూడి

నాకు ఉన్న ఎకరం పోలంలో వరి పంట సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఈ సంవత్సరం వరి పంట పూర్తిగా ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు

మారుమూడి భూషణం, రైతు, గుళ్లపూడి

మా అన్నదమ్ములందరం కలిసి మా నాన్న ఇచ్చిన 1.50 ఎకరాల్లో వరి సాగుచేశాము దుక్కులు మొదలు, వరి నారు కోనడం, పంట నాటడానికి కూలీల ఖర్చు, ఎరువుల ఖర్చు, రసాయన ఎరువుల ఖర్చు, కలుపు కూలీల ఖర్చు భారీగా పెట్టుబడి పెట్టాము. పంట చేతికోచ్చేసమయంలో వర్షాలు లేక పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం ఆదుకోవడమో.లేదా సాగునీరు ఆందించడమో చేయాలని, పంటకు మొత్తం ఖర్చు పెట్టి పండే దశలో ఇలా ఎండిపోతంటే మా భాధను ప్రభుత్వం గుర్తించాలి.

నష్టం వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేశాం

ఎస్.మధుమోహన్, మండల వ్యవసాయాధికారి

గుడిపాడులోని రాయకుంటచెరువు కింద సాగుచేసిన వరి పంటను పరిశీలించాను. సుమారు 40 నుంచి 50 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. దీన్ని బట్టి మండలంలోని వరి పొలాల పరిస్థితిపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాము.

అన్ని రంగాల్లో రాణించేలా

యువతకు ప్రోత్సాహం

యువజన సర్వీసుల శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ మెహర్రాజ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

క్రీడలతో పాటు యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేలా అనేక అవగాహన కార్యక్రమాలు పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్నామని యువజన సర్వీసుల శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ ఎమ్‌డి హెచ్.మెహర్రాజ్ తెలిపారు. యువతకు కెరీర్ అవకాశాలు కల్పించడానికి ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.. క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడల్లో ప్రమాణాలు పెంపొందించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.. రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు జిల్లా నుంచి ఎంతమంది పాల్గొంటున్నారు? తదితర ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలిచ్చారు.

ప్రశ్న : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం ఎప్పటి నుంచి ప్రారంభం కానుంది?

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో వచ్చే డిసెంబర్ 11వ తేదీ నుంచి గ్రామ వార్డు పరిధిలోను, డిసెంబర్ 21వ తేదీన మండల నియోజకవర్గ స్థాయిలోనూ, 31వ తేదీన జిల్లాస్థాయిలోనూ పోటీలు జరుగుతాయి. ఆ తర్వాత రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లాస్థాయి పోటీల్లో విజేతలను ఎంపిక చేస్తాము.

ప్రశ్న : ఏయే క్రీడల్లో ఈ పోటీలుంటాయి? అందుకు అవసరమైన క్రీడా సామగ్రి ఏమైనా ప్రభుత్వం నుంచి వచ్చిందా?

క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖో ఖో, కబడ్డీ వంటి పోటీలుంటాయి. ఇప్పటికే క్రికెట్ వాలీబాల్ కిట్లు జిల్లాకు చేరుకున్నాయి.

ప్రశ్న : పులివెందులలో ఉన్న స్పోర్ట్స్ అకాడమీకి సెలక్షన్స్ జరిగాయా? జిల్లా నుంచి ఎంతమంది ఎంపికయ్యారు?

స్పోర్ట్స్ అకాడమీకి ఈనెల నాలుగు, ఐదు తేదీల్లో జిల్లాస్థాయి ఎంపికలు జరిగాయి. 17 మందితో జాబితాను పంపాము. అక్కడ మళ్లీ ఫైనల్ సెలక్షన్ ఉంటుంది.

ప్రశ్న : ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు పనులు ఎంతవరకు వచ్చాయి?

ఖేల్ ఇండియాలో భాగంగా సింథటిక్ ట్రాక్ పనులు ఇంకా మొదలు పెట్టలేదు. ట్రాక్ ఏర్పాటుకు రూ.తొమ్మిది కోట్లతో ప్రతిపాదనలు పంపాము. అందులో నాలుగు కోట్ల రూపాయలు ఏలూరు పార్లమెంటు సభ్యులు కోటగిరి శ్రీధర్ ఇస్తున్నారు. మిగిలిన సొమ్ము స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి మంజూరు కావాల్సి ఉంది.

ప్రశ్న : ప్రస్తుతం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో రెగ్యులర్ కోచ్‌లు ఎంతమంది ఉన్నారు? కోచ్‌ల నియామకం చేపట్టే అవకాశం ఏమైనా ఉందా?

ప్రస్తుతం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలు ఫుట్ బాల్, వెయిట్ లిఫ్టింగ్‌కు మాత్రమే రెగ్యులర్ కోచ్‌లున్నారు. మిగిలిన క్రీడాంశాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కోచ్‌లు పనిచేస్తున్నారు. కోచ్‌ల నియామకం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం.

ప్రశ్న : జంగారెడ్డిగూడెం ప్రాంతంలోని ఎర్రకాలువ రిజర్వాయర్లో నిర్వహిస్తున్న వాటర్ గేమ్స్ కోచింగ్ ఎలా జరుగుతుంది? కోచ్‌లున్నారా? ఎంతమంది కోచింగ్ తీసుకుంటున్నారు?

ప్రస్తుతం 20 మంది వాటర్ గేమ్స్‌లో కోచింగ్ తీసుకుంటున్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన ఇద్దరు అక్కడ కోచింగ్ ఇస్తున్నారు.

ప్రశ్న: ఏలూరులోని ఇండోర్ స్టేడియం నిర్వహణ అధ్వానంగా ఉండటం వల్లనే, ఇలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో కూలిపోయిందనే అపోహలు ప్రజల్లో ఉన్న నేపథ్యంలో ఇండోర్ స్టేడియం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గతంలో ఇండోర్ స్టేడియం మరమ్మతులకు రూ.22 లక్షలు మంజూరైనప్పటికీ సకాలంలో పనులు జరగలేదు. అది కూలిపోయిన నేపథ్యంలో రూ.రెండు కోట్లతో కొత్త ఇండోర్ స్టేడియం నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాము. ఎస్టిమేషన్ ఇవ్వాలని హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఇండోర్ స్టేడియం మైదానంలో స్కేటింగ్ రింక్, వెయిట్ లిఫ్టింగ్ హాల్, హ్యాండ్ బాల్ కోర్ట్ కూడా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పంపాము.

ప్రశ్న : యువతకు ఉపాధి అవకాశాలు పెంచడానికి యువజన సర్వీసుల శాఖ ద్వారా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌లో అవగాహన కార్యక్రమాలను అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో నిర్వహించడం జరుగుతుంది. దీని ద్వారా పదో తరగతి తర్వాత యువతకు ఉండే ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది. అంతేకాక ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, ప్రభుత్వ ఐటిఐతో కలిపి జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాము. ఇటీవల జరిగిన జాబ్ మేళాలో జిల్లాలో 39 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాము.

ప్రశ్న : యువతలో సామాజిక బాధ్యత పెంపొందించేలా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

వివిధ కోచింగ్ సెంటర్ల ద్వారా వివిధ కాంపిటేటివ్ పరీక్షలకు యువతకు కోచింగ్ ఇస్తున్నాము. అలాగే రక్తదాన శిబిరాల నిర్వహణ, మొక్కలు నాటడం వంటివి నిర్వహించి యువతలో సామాజిక బాధ్యతను పెంచే చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ఉద్యోగులు సంఘటితంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సంఘటితంగా సమస్యలపై ఉద్యమించాలని ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర ఛైర్మన్ కె.సుమన్ పేర్కొన్నారు. ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవన్‌లో జిల్లాస్థాయి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ జరిగింది. ఈ సభకు సుమన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సభనుద్దేశించి సుమన్ మాట్లాడుతూ తక్కువ వేతనానికి ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అభద్రతాభావంతో పనిచేస్తున్నారని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేకమైన సర్వీస్ రూల్స్‌ను తయారుచేసి అమలు చేయాలని, పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు చాలక ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.రాష్ట్రంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ పథకాలు నిలిపివేశారని దీంతో కుటుంబ సభ్యులు ఎంతగానో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ పథకాలన్నీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపచేయాలన్నారు. ఎపి జెఎసి అమరావతి ఏలూరు జిల్లా అధ్యక్షులు కె.రమేష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేని కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొని అభద్రత భావంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. జెఎసి అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎపి జెఎసి అమరావతి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షురాలు జ్యోతి, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి నాయకులు గురునాథ్, సుశీల, లక్ష్మీ కుమారి, హైమావతి, రంగ భాస్కర్, కిషోర్ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఎలిజా

వర్షాభావంతో పంట నష్టపోయిన రైతులకు న్యాయం : ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

వర్షాభావంతో వరిపంట ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారమందేలా కృషి చేస్తామని ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. మండలంలోని సమ్మెటవారిగూడెం, ఎసిఅగ్రహారం, మల్లయ్యగూడెం గ్రామాల్లో వరిపంట నష్టపోయిన రైతులతో ఆయన ఆదివారం మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు వర్షాభావం వల్ల చేతికొచ్చిన పంట ఎండిపోతుందని, చెరువులు అడుగంటుతున్నాయని ఎంఎల్‌ఎ వద్ద రైతులు అవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు నివేదిక ఇస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, సిటి మెడికల్ దుర్గారావు, ఉర్లగూడెం సర్పంచి యువరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి శిబిరానికి రాంబాబు

భీమవరం: ఈ నెల 25 నుండి వచ్చే నెల ఐదో తేదీ వరకు పంజాబ్‌లోని రూప్‌నగర్‌లో జరగబోయే ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ శిబిరానికి డిఎన్ఆర్ కళాశాల సీనియర్ డివిజన్ ద్వితీయ సంవత్సర క్యాడెట్ పి.రాంబాబు ఎంపికైనట్లు ఆ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సిహెచ్‌జె.సోమరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్‌ను కళాశాల ఆవరణలో ఆదివారం అభినందించారు. ముఖ్యఅతిథి కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు జి.పాండురంగరాజు మాట్లాడుతూ అత్యుత్తమ ప్రదర్శనతో ఒక జాతీయ క్యాంపులో కళాశాల క్యాడెట్ ఎంపిక కావడం గొప్ప విషయమని, కళాశాలకు గర్వకారణమని అన్నారు. ప్రతి క్యాడెట్ జాతీయ క్యాంపులో పాల్గొనడానికి ఎంతో శ్రమకోర్చి ప్రయత్నిస్తారని, అందులో కొంతమంది మాత్రమే సాధించగలుగుతారని అన్నారు. కళాశాల పరిపాలనాధికారి పి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ కళాశాల క్యాడెట్లు జాతీయస్థాయి క్యాంపులో పాల్గొనడం సంతోషకరమని, జాతీయస్థాయి క్యాంపులో పాల్గొనడం ద్వారా జాతీయ సమైక్యతను పెంపొందించుకోవచ్చని అన్నారు. ఎంపికైన క్యాడెట్‌లను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు నరసింహారాజు, కార్యదర్శి సత్యనారాయణరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా కొమరం భీమ్, శంకరన్ జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కొమరం భీమ్, ఎస్ఆర్.శంకరన్ జయంత్యుత్సవాలు కోటరామచంద్రపురం ఐటిడిఎ సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెఎసి ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ కొమరం భీమ్ జల్...జంగిల్... జమీన్ నినాదంతో నిజాం పాలకులకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం ఫలితంగా అనేక హక్కులు సాధించామని కొనియాడారు. కొందరికి పదవులు వల్ల గుర్తింపు లభిస్తుందని, మరికొందరికి పదవులకే గుర్తింపు తెస్తారని, రెండో కోవకు చెందిన వారు ఎస్అర్.శంకరన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో దళిత, ఆదివాసీల సంక్షేమం, అభ్యున్నతికి బాటలు వేసే అనేక అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఒక్క ఏడాదిలోనే 120కిపైగా జిఒలు జారీచేసిన ఘనత ఆయనదేనన్నారు. ఐటిడిఎల ఏర్పాటులో, గిరిజన ఉపప్రణాళికలను ప్రవేశ పెట్టడంలో ఎస్ఆర్.శంకరన్ ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ గౌరవ సలహాదారులు కొవ్వాసి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు, జిల్లా అధ్యక్షులు సోదెం రాజు, ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ, వైస్ ఛైర్మన్ కుర్సం దుర్గారావు, ఆదివాసీ మహాసభ నాయకులు మూలెం రాంబాబు, ఆదివాసీ మెడికల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పండు చినబాబు, ఎఎస్‌పి జిల్లా గౌరవ అధ్యక్షులు సోదెం మల్లయ్య, ఎఎస్‌పి నాయకులు సోదెం ముఖేష్, తెల్లం రవిప్రసాద్, పైదా పోతురాజు పాల్గొన్నారు.

తల్లడిల్లిన తణుకు

వేర్వేరు విహార యాత్రల్లో ఆరుగురు దుర్మరణం, మరొకరు గల్లంతు
మొన్న కాకినాడ జిల్లా.. నిన్న పేరుపాలెం బీచ్‌ల్లో ఘటనలు
శోకసంద్రమైన తణుకు పరిసర ప్రాంతాలు

వేర్వేరు విహార యాత్రల్లో తణుకు పట్టణానికి చెందిన ఆరుగురు మృత్యువాత పడటం, మరొకరు గల్లంతు కావడం తీవ్ర విషాదం నింపింది. శనివారం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోపులంకలో గోదావరిలో స్నానానికి దిగిన సజ్జాపురానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాల కోసం పట్టణవాసులు ఎదురుచూస్తుండగానే ఆదివారం పేరుపాలెం బీచ్‌లో తణుకులోని బొమ్మలవీధికి చెందిన ఇద్దరు మృత్యువాత పడగా మరొకరు గల్లంతయ్యారు. వరుస ఘటనలతో తణుకు పట్టణ ప్రజలు తల్లడిల్లారు.

బీచ్‌లో సావిత్రి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

సావిత్రి (ఫైల్‌ఫొటో)

రఘువర్మ(ఫైల్‌ఫొటో)

మొగల్తూరు : విహార యాత్ర మరోసారి తణుకు పట్టణవాసులను బలిగొంది. మండలంలోని పేరుపాలెం బీచ్‌కు తణుకు పట్టణంలోని బొమ్మలవీధికి చెందిన సుమారు 15 మంది రెండు ఆటోల్లో ఆదివారం ఉదయమే చేరుకున్నారు. మధ్యాహ్న సమయంలో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతికి వీరిలో కొందరు నీట మునిగారు. దీన్ని గమనించిన స్థానికులు అప్రమత్తమై వారిని ఒడ్డుకు తీసుకొచ్చేందుకు శ్రమించారు. గొరసా సావిత్రి (35), అనపోజు శ్రావణి, గోరస తన్మయి, అనపోజు రఘువర్మ (25)లను ఒడ్డుకు చేర్చగా అప్పటికే సావిత్రి ప్రాణాలు కోల్పోయింది. మిగిలిన ముగ్గురిని హుటాహుటీన అంబులెన్స్‌లో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రఘువర్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రావణి, తన్మయిల పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. వీరితోపాటు నీట మునిగిన అనపోజు వసంతకుమార్ (17) గల్లంతయ్యాడు. వసంతకుమార్ ఆచూకీ కోసం పోలీసులు బీచ్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని సిఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్ఐ ఎం.వీరబాబు సందర్శించారు. సావిత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తణుకు: సజ్జాపురానికి చెందిన యువకుల విహారయాత్ర విషాదమయమైన ఘటన జరిగిన 24 గంటల్లోపే మరో ఘటన పేరుపాలెం బీచ్‌లో చోటుచేసుకుంది. బీచ్‌లో మృతి చెందిన గొరసా సావిత్రి పట్టణంలో యల్లారమ్మ గుడి సమీపంలో నివాసం ఉంటుంది. ఆమె ఇంటి వద్దే ఉంటోంది. అనపోజు రఘువర్మ విజయవాడలోని ఇంజినీరింగ్ పూర్తి చేయగా, వసంత్‌కుమార్ డిగ్రీ చదివాడు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. రఘువర్మ, వసంత్‌కుమార్ వీరభద్రపురంలోని రాజేశ్వరిపుంతకు చెందినవారు. దీంతో ఆయా ప్రాంతాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

గోదావరిలో గల్లంతైన తణుకు యువకుల మృతదేహాలు లభ్యం

తణుకు : కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోపులంక వద్ద గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన నలుగురు యువకుల్లో నలుగురి మృతదేహాలూ లభ్యమయ్యాయి. తణుకులోని సజ్జాపురం ప్రాంతానికి చెందిన యువకులు విహారయాత్రకు యానాం వెళ్లిన సంగతి తెలిసిందే. వీరు యానాం నుంచి తిరుగుప్రయాణంలో శనివారం సాయంత్రం తాళ్లరేవు మండలం గోపులంక వద్దకు వచ్చేసరికి గోదావరిలో స్నానానికి దిగి నలుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారి మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. తొలుత పెండ్యాల బాలాజీ, మద్దిని ఫణీంద్రగణేష్, హనుమకొండ కార్తీక్ మృతదేహాలు లభ్యమయ్యాయి. తర్వాత కొద్దిసేపటికి రవితేజ మృతదేహం లభ్యమైంది. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మధ్యతరగతి కుటుంబాల్లో పెను విషాదం

గోపులంకలో గోదావరిలో నీట మునిగి మృతి చెందిన యువకులంతా మధ్యతరగతి కుటుంబీకులే. కన్నవారు వారిని ఉన్నత చదువులు చదివించినా విహారయాత్ర రూపంలో మృత్యువు కాటేయడాన్ని ఆ కుటుంబీకులు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతుల్లో ఒకరైన తిరుమల రవితేజ తండ్రి 2016లో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో తల్లి టీ కొట్టు నడుపుకుంటూ కొడుకును ఉన్నత చదువు చదివిస్తోంది. పెండ్యాల బాలాజీ తల్లి ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తోంది. ముద్దన ఫణీంద్ర గణేష్ తండ్రి ఉపాధి కోసం దుబాయి వెళ్లారు. అనుమకొండ కార్తీక్ సోనోవిజన్ కంపెనీలో పని చేస్తున్నాడు.

సుందరరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ముసునూరు

కొర్లకుంట ఎంపిటిసి మృతి చెందడం ముసునూరు మండల వైసిపి రాజకీయాల్లో తీరని లోటని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన ఎంపిటిసి, వైసిపి నాయకుడు వస్సుమాటి సుందర రావు(46) గుండెపోటుతో మృతి చెందారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత 20 సంవత్సరాల నుంచి రాజకీయ అనుభవంతో వైసిపిలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ, అందరి మన్ననలను పొందిన వ్యక్తి మరణించడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.


చర్చి నిర్మాణానికి విరాళం అందిస్తున్న బోడా అవినాష్

చర్చి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - చింతలపూడి

రాణి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాణి మెమోరియల్ ట్రస్ట్ ఫౌండర్ బోడా అవినాష్ తెలిపారు. మండలంలోని పాత చింతలపూడి సెంట్ విన్సెంట్ చర్చి ఆలయంలో చర్చి నిర్మాణ పనులు నిమిత్తం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రటరీ సరిపల్లి లెనిన్, పెద్దలు బొంత విజయ్, బేతి శ్యామ్, సరిపల్లి నవీన్, సంఘస్తులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలను అందజేస్తున్న రామమూర్తి నాయుడు

కృత్రిమ అవయవాలతో ఆత్మవిశ్వాసం పెంపు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వికలాంగులకు కృత్రిమ అవయవాలు అమర్చడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) మాజీ సభ్యులు, విజ్ఞాన్ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.రామమూర్తి నాయుడు తెలిపారు. మండల పరిధిలోని హీల్-పలిజబెత్ ఫౌంటెన్ లెన్స్ ఆఫ్ హాప్ కృత్రిమ అవయవ కేంద్రంలో ఆదివారం ఐదుగురు వికలాంగులకు కృత్రిమ అవయవాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో హీల్ సంస్థ అమెరికా ప్రతినిధి కారలిన్ జార్జి, హీల్ సంస్థ లండన్ ప్రతినిధి జూలీ కాన్సార్స్, హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.సత్యప్రసాద్, సిఇఒ కె.అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నారావు పాల్గొన్నారు.

రుణార్హత కార్డుల్లేక పథకాలకూ దూరం..

ఇవ్వాల్సింది 4,500 పైబడి.. ఇచ్చింది 2,639 సిసిఆర్ కార్డులే

ఆవేదనలో కౌలురైతులు

వరి సాగులో కౌలురైతు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో 4,500 పైబడి రైతులకు గానూ 2,629 మందికి మాత్రమే సిసిఆర్ కార్డులను రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకూ అందజేశారు. ఈ మండలంలో భూ యజమానుల కంటే కౌలుదారులే సాగు చేస్తున్నవారు అధికంగా ఉన్నారు. సిసిఆర్ కార్డులుంటే కానీ ప్రభుత్వం నుంచి వ్యవసాయాధార పథకాలు రాని పరిస్థితి నెలకొంది. నిజమైన కౌలుదారులకు సిసిఆర్ కార్డులు ఇవ్వడంలో సంబంధిత అధికారులు సరిగా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఉంగుటూరు మండలంలో డెల్టా, మెట్ట కింద వరి దాదాపు 27 వేల ఎకరాలకుపైగా సాగు చేస్తున్నారు. ఇ-పంట నమోదుకు ఈ కార్డులే కీలకం. నిబంధనలు సడలించి ప్రభుత్వ పథకాలు కౌలుదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిసిఆర్ కార్డుల జారీలో అన్యాయం తగదు

కొర్ని అప్పారావు, కౌలు రైతుల సంఘం నాయకుడు

నిజంగా వ్యవసాయం చేసే కౌలుదారులెవరో అధికారులకు అన్నీ తెలిసినా.. నిబంధనల పేరుతో సిసిఆర్ కార్డులు ఇవ్వడంలో జాప్యం సరికాదు. అవిలేక పండిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కాకుండా, వర్తకులకు రేటు తగ్గించి అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సిసిఆర్ కార్డులు అర్హులందరికీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

డ్రాగన్ ఫ్రూట్ తోట..

డ్రాగన్ ఫ్రూట్..

ఉద్యోగంలో కాదు.. సాగులోనే ఆనందం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విదేశాలలో ఉన్నత విద్యాభ్యాసం, మంచి జీతంతో ఉద్యోగంను వదులుకొని సొంత ఊరిలోనే వ్యవసాయం చేస్తున్నారా రైతు.. ఎకరానికి ఆరు లక్షలు పెట్టుబడి పెడుతుంటే నవ్వుకున్న స్థానిక రైతులు ఇప్పుడు అతని ఆదాయాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు.. ఆయనే గూడవల్లి వెంకటరమణ.. స్థానిక ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు డ్రాగన్ ఫ్రూట్ ఎగుమతి, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు పెంపకం ద్వారా కూడా ఆదాయం సంపాదిస్తూ.. తనతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు ఆ యువరైతు..

రూ.3 లక్షల జీతం వదిలి డ్రాగన్ ఫ్రూట్ వ్యవసాయం

సంవత్సరానికి రూ.5 లక్షల ఆదాయం

వ్యవసాయం ద్వారా పది మందికి ఉపాధి

నూతన వ్యవసాయ రంగంలో ముందుకు సాగుతున్న యువ రైతు

బుట్టాయగూడెం మండలం సూరప్పవారి గూడెం గ్రామానికి చెందిన గూడవల్లి వెంకటరమణ ఉన్నత విద్యాభ్యాసం మాస్టర్ ఇన్ ఇంటర్నేషనల్ బిజినెస్ ఆస్ట్రేలియాలో చేసి నెలకు రూ.3 లక్షల జీతం వస్తున్నా వదులు కొని, విదేశాలకే పరిమితమైనటువంటి డ్రాగన్ ఫ్రూట్ వ్యవసాయాన్ని మెట్ట ప్రాంతమైన బుట్టాయిగూడెం మండలానికి పరిచయం చేశారు. ప్రసిద్ధిగాంచిన గుబ్బల మంగమ్మ తల్లి గుడికి వెళ్లడానికి రహదారి మార్గమధ్యలో ఉన్నటువంటి సూర్పవారి గూడెం సమీపంలో నాలుగు ఎకరాల 50 సెంట్లు సొంత భూమిలో రూ.6 లక్షల ఖర్చుతో, 4.5 ఎకరాలలో 500 స్తంబాలు, 2 వేల మొక్కలతో డ్రాగన్ ఫ్రూట్ వ్యవసాయం ప్రారంభించారు. మొదటిగా వ్యవసాయానికి పెట్టుబడి పెట్టడానికి 4.5 ఎకరాలకు రూ.6 లక్షలు ఖర్చు అవ్వగా ప్రస్తుతం సంవత్సరానికి రూ.5 లక్షల ఆదాయం వస్తుందని తెలియజేశారు. అంతేకాకుండా 10 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ మండలంలో పండిన డ్రాగన్ ఫ్రూట్ పంటను లోకల్ మార్కెట్, వైజాగ్, హైదరాబాద్, ఖమ్మం, విజయవాడ, చెన్నై, కేరళకు ఎగుమతి చేస్తున్నారు. ఈ పండ్లలో మంచి పోషక విలువలు ఉండడంతో ప్రస్తుతం మార్కెట్‌లో మంచి గిరాకి ఉంది. ఈ యువ రైతు పండ్ల ద్వారానే కాకుండా ఒక్కో మొక్కను రూ.35 నుంచి రూ.50కు అమ్మి కూడా ఆదాయాన్ని పొందుతున్నారు. గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లే మార్గమధ్యలో ఈ డ్రాగెన్ ఫ్రూట్ తోట ఉండడంతో దర్శనానికి వెళ్లి వచ్చే భక్తులు, యాత్రికులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

అప్పుడు నవ్వుకున్నారు.. ఇప్పుడు ఆశ్చర్యపోతున్నారు

గూడవల్లి వెంకటరమణ, సూరప్పవారిగూడెం

ఆస్ట్రేలియాలో మంచి జీతంతో ఉద్యోగం చేస్తున్న నాకు కొన్ని విభిన్న పరిస్థితుల వల్ల మా సొంత ఊరు బుట్టాయగూడెం మండలం సురప్పవారిగూడెం వచ్చి ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఖాళీగా ఉండడం ఎందుకని డ్రాగన్ ఫ్రూట్ వ్యవసాయం చేయడానికి నిర్ణయించుకున్నాను. వ్యవసాయం చేయాలనుకున్నప్పుడు కొంతమంది రైతులు నన్ను చూసి నవ్వుకున్నారు. అంత ఖర్చు పెట్టి వ్యవసాయం చేయడం ఎందుకు అని అన్నారు. కానీ వాటిని నేను పట్టించుకోకుండా ఈ వ్యవసాయం ప్రారంభించాను. ఇప్పుడు మంచి ఆదాయాన్ని పొందుతూ ఇంకో పది మందికి ఉపాధి కల్పిస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది. ప్యాషన్‌తో చేస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చు అనేది నా నమ్మకం. యువత ఏ రంగాన్ని ఎంచుకున్నా పట్టుదలతో పనిచెయ్యాలి.

వైసిపితోనే దళితుల అభివృద్ధి

వైసిపి ఎస్‌సి సెల్ ప్రాంతీయ సదస్సులో ఎంఎల్ఎ ఆళ్లనాని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వైసిపి పాలనలో దళితులు, పేదలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ ఆళ్ల నాని తెలిపారు. వైసిపి ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ యాత్ర సన్నాహక సదస్సును ఆదివారం ఏలూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో దళిత, బడుగు బలహీన వర్గాలు ధైర్యంగా జీవిస్తున్నారని తెలిపారు. బడుగు వర్గాల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ రాష్ట్ర భవిష్యత్ కోసం జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం అత్యంత ఆవశ్యకమన్నారు. ప్రతిపక్షాలు రాష్ట్ర అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటూ.. చేస్తున్న దుష్ప్రచారాలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాల కుట్రలను ఎదుర్కోవడంలో జగన్‌కు అండగా నిలబడాలని, జిల్లాలో జరిగే సామాజిక న్యాయ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు మేరుగు నాగార్జున మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి ఆలోచనా విధానాన్ని జగన్‌మోహన్ రెడ్డి అనుసరిస్తున్నారన్నారు. పేదల అభ్యున్నతి కోసం, వారికి బంగారు భవిష్యత్తు అందించడం కోసం వైఎస్ జగన్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు అడుగడునా దళితులను అవమానించారని, టిడిపి హాయాంలో దళితులపై, అనేక అకృత్యాలు జరిగాయని విమర్శించారు. ఎంపీ నందిగం సురేశ్ మాట్లాడుతూ నవరత్నాలలో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని


సదస్సులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆళ్ల నాని

తెలిపారు. నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి మరిన్ని వ్యాధులను చేర్చి నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులోకి తీసుకు వచ్చామని తెలిపారు. సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ వైఎస్ జగన్ నేతృత్వంలో దళితులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థతో పల్లెల్లో మార్పు ప్రస్ఫుటంగా కనిపిస్తుందన్నారు. అనంతరం ఎంఎల్ఎలు ఎలిజా, కైలే అనిల్ కుమార్, తలారి వెంకట్రావు, రక్షణనిధి, చిట్టిబాబు, సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, ఎంఎల్‌సిలు పండుల రవీంద్ర, ఇశ్రాయేలు, ఎం.అరుణ్ కుమార్, తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో దళిత నేతలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం తొలగించాలి

అధికారులకు విన్నవించినా ఫలితం లేదు

గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రధాన రహదారిపై నిర్మించిన అక్రమ కట్టడాన్ని అధికారులు వెంటనే తొలగించాలని మండలంలోని పెదకామనపూడి గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. వివరాల్లోకెళితే వడాలి - తామరకొల్లు ఆర్అండ్‌బి రహదారిలో వెదకామనపూడి వద్ద రహదారిని ఆక్రమించి, గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమ కట్టడం నిర్మాణం చేస్తున్నాడు. ఈ అక్రమ కట్టడం నిర్మాణం వల్ల గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నట్లు చెబుతున్నారు.

అంతేకాక రహదారిపై వాహనాల రాకపోకలకు కూడా ఈ కట్టడం అడ్డంకిగా మారుతుందని అంటున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించి, నిర్మాణం చేస్తున్న అక్రమ కట్టడం తొలగించాలంటూ పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని రహదారిపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలంటూ సంబంధిత అధికారులను పెదకామనపూడి గ్రామస్తులు కోరుతున్నారు.

రహదారిలో నిర్మించిన అక్రమ కట్టడం

రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది

జనంలోకి జనసేన కార్యక్రమంలో పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దూరమైందని, రాష్ట్రం అప్పుల పాలైందని నియోజవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉంగుటూరులో కొనేరు పేట, సాలి పేట వీధులలో ఆయన నాలుగవ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా జనసైనికులతో పాటు ఇంటింటికి వెళ్లి స్థానికంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జనసేన సిద్ధాంతాలను, పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజలకు వివరించారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కరువైందని, రాష్ట్ర ప్రజలు రాజధాని ఏదో కూడా చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. పోలవరం నిర్మాణం ఆగిపోయిందని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం అన్ని వ్యవస్థలు భ్రష్టు పట్టేలా చేసిందని అసహనం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, సకాలంలో జీతాలు కూడా చెల్లించకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలియజేశారు. గ్రామాలకు కనీస సౌకర్యాలు అయినటువంటి రోడ్లు, డ్రెయినేజీలు కూడా వేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన

వికలాంగుడి సమస్యను తెలుసుకుంటున్న ధర్మరాజు

హామీలలో మోసాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు మండలం జనసేన అధ్యక్షులు నిమ్మల దొరబాబు, పత్తి మధన్, సూరత్తుల అయ్యప్ప, వీర మహిళలు మద్దాల విజయలక్ష్మి, నిమ్మల మౌనిక, పాలూరీ దుర్గా ప్రసాద్, సూరత్తుల రామకృష్ణ, సూరాత్తుల మధు, అడపా అంతర్వేది, సూరత్తుల అశోక్, వెజ్జు రాంబాబు, తోట శ్రీను, తానేటి జోగేశ్వరావు, ఇంటి మంగరాజు, మద్దాల ఉమ, కొండవీటి వీర భద్రరావు, కొత్తపల్లి చంటి, వాడపల్లి మధన్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - ముసునూరు

అతివేగం ప్రమాదకరం అనే విషయం మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం గుడివాడ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున కాట్రేనిపాడు గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో విద్యుత్ స్తంభానికి ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని విజయవాడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఆ సమయంలో విద్యుత్తు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని, విద్యుత్ సంస్థ వారికి మాత్రం భారీ నష్టం వాటిల్లిందని గ్రామస్తులు అంటున్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న మినీ వ్యాన్

అస్వస్థతకు గురైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థత గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం పెదమల్లంలోని పెదపేటకు చెందిన గంధ చంద్రశేఖర్(33)కు భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కారణం తెలియదు కానీ ఈనెల 21న సాయంత్రం పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. అతనిని తొలుత దగ్గరలోని ఆసుపత్రికి తీసుకువెళ్లి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పరారీలో ఉన్న వ్యక్తి అరెస్టు: రిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గంజాయి కేసులో పోలీసులకు పట్టుబడకుండా పరారీలో ఉన్న ఒక వ్యక్తిని ఏలూరు టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు కొత్తపేటకు చెందిన గేదెల సతీష్ మరో వ్యక్తి కలిసి ఏజెన్సీ జూన్‌లో గంజాయి రవాణా చేస్తుండగా ఏలూరు టూటౌన్ పోలీసులు ఒక వ్యక్తిని అరెస్టు చేయగా గేదెల సతీష్ పరారీలో ఉన్నాడు. ఆదివారం ఏలూరు పోలీసులకు చిక్కాడు. దీంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అతనిని అరెస్టు చేశారు. శనివారం ఏలూరులోని కోర్టుకు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు.

పేకాట ఆడుతున్న వ్యక్తులు అరెస్టు

ఏలూరు స్పోర్ట్స్ : పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు త్రి టౌన్ సిఐ కోమాకులు శివాజీ తెలిపారు. ఏలూరు సమీపంలోని శనివారపుపేట జెడ్పి హైస్కూలు ఎదురుగా వి.రమణ అనే ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి నిర్వహించామని సిఐ తెలిపారు. వారి నుంచి రూ.10 వేల 200 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్లలంకలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు సిఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు రూరల్ ఎస్ఐ రాజారెడ్డి తన సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి, రూ.21 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శ్రమదానంతో సిపిఎం స్థూపం ఆధునికీకరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

శ్రమదానం చేస్తున్న సిపిఎం కమిటీ సభ్యులు

శ్రమదానంతో స్థానిక రాజీవ్ నగర్‌లోని సిపిఎం స్థూపానికి ఆధునీకరణ పనులు చేపట్టారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్ నగర్ సిపిఎం స్థూపం వద్ద పట్టణ కమిటీ సభ్యులు శ్రమదానం చేశారు. డివైఎఫ్ఐ సభ్యులు మాబు సుభాని ఆర్థిక సహకారంతో సిపిఎం జెండా స్థూపానికి రైలింగ్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి పసల సూర్యారావు మాట్లాడుతూ పేదల పార్టీ అయిన సిపిఎం స్థూపం ఆధునీకరణకు సహకారం అందించిన సుభానికి కృతజ్ఞతలు తెలిపారు అలాగే స్థూపం ఆధునీకరణ పనులకు సహకారం అందించిన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వంగ గోపి, చల్లారి మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

19న కాపు వనసమారాధన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరులో నవంబర్ 19న కాపుల వనసమారాధన జరపాలని కాపు పెద్దల సమావేశంలో నిర్ణయించారు. కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కాపు పెద్దల సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. గోపన్నపాలెం శివారు(సానిగూడెం అడ్డరోడ్) కూరంశెట్టి ధనంజయరావు తోటలో 5,000 మందికి తగిన ఏర్పాట్లు చేయటానికి తోటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు వాసా రాజు, పూజారి నిరంజన్, తన్నీరు బుజ్జి, పాటే రాంబాబు, యడ్లపల్లి ప్రసాద్, కొప్పిశెట్టి వేణు గోపాల్, యాళ్లబండి శ్రీరామ్, సామర్ల వెంకటేశ్వర రావు, వీరంరెడ్డి రమేష్, బొండా రాము నాయుడు, సవిరే రాజేష్, మంచెం వెంకటేశ్వర రావు, కూరంశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

బిజెపి ప్రభుత్వంలో కార్మిక చట్టాలకు తూట్లు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఎఐటియుసి పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను మోడీ నాలుగు కోడ్లుగా మార్చి కార్మిక చట్టాలను కాల రాస్తున్నారని ఎఐటియుసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు ఆరోపించారు. ఎఐటియుసి జిల్లా కన్వీనింగు కమిటీ సమావేశం స్థానిక స్ఫూర్తి భవనంలో జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రామారావు మాట్లాడుతూ అక్టోబర్ 31వ తేదీన ఎఐటియుసి 104వ వ్యవస్థాపక దినోత్సవం ఎఐటియుసి అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరావు మాట్లాడుతూ 2023 డిసెంబర్ 9, 10 తేదీలలో ఏలూరులో ఎఐటియుసి జిల్లా ప్రథమ మహాసభలు నిర్వహించడానికి ఆదివారం జరిగిన జిల్లా సమావేశం నిర్ణయించిందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ జిల్లాలో ఎఐటియుసి నిర్మాణ అభివృద్ధికి సిపిఐ పార్టీగా సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా కన్వీ నింగ్ కమిటీ సభ్యులు కె.కృష్ణమాచార్యులు, సిహెచ్ పుల్లారావు, తొర్లపాటి బాబు, కంకిపాటి బుచ్చిబాబు, భజంత్రీ శ్రీనివాసు, పుప్పాల కన్నబాబు, కుంచె వసంతరావు, ఎ.అప్పలరాజు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ రైతులకు లాభదాయకం

చాట్రాయి : ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు పాడి పరిశ్రమ ఎంతో లాభదాయకంగా, ఆదాయ మార్గంగా ఉంటుందని కృష్ణ మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. తిరువూరు చిల్లింగ్ సెంటర్ పరిధిలో మర్లపాలెం, టి.గుడిపాడు పాల సంఘాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో రానున్న రోజుల్లో కూడా యువత ఎక్కువ మంది పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారని తెలియజేశారు. కృష్ణ మిల్క్ యూనియన్ కూడా రైతుల ఆలోచనల అనుగుణంగా గిట్టుబాటు ధరని కల్పిస్తూ పది శాతం వెన్న కలిగిన పాలకు రూ.80 చెల్లిస్తుందన్నారు. రైతులకు ఉచితంగా కళ్యాణమస్తు, క్షీరబంధు, రైతు కుటుంబంలో చదువుకునే పిల్లలకే ప్రతిభలాంటి పథకాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, సంఘాల అధ్యక్షులు మందలపు వీర వెంకట రాఘవరావు, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాలనీలో తాగునీటి కుళాయి ఏర్పాటు

ముదినేపల్లి : మండలంలోని పేయ్యేరు పంచాయతీ శివారు వైఎస్ఆర్ కాలనీలో పంచాయతీ అధికారులు మంచినీటి కుళాయిని ఏర్పాటు చేశారు. ఈనెల 20వ తేదీ కాలనీవాసులు మండల బిజెపి నేతలతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణను కలిసి కాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, అదేవిధంగా డ్రెయినేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉందంటూ వినతిని అందజేశారు. ఈ సమస్యపై స్పందించిన ఇఒపిఆర్‌డి పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో కాలనీలో తాత్కాలికంగా మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయించారు. అధికారులు ఇచ్చిన మాట ప్రకారం మంచి నీటిపైపు తక్షణమే ఏర్పాటు చేయడం పట్ల కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.